క్లుప్తంగా

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర ఆలయంలో గురువారం వసంత నవరాత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ప్రారంభించిన విషయం విధితమే. దీనిలో భాగంగా ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ ఉదయం విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. సాయంత్రం బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్రపుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేద స్వస్తి నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈనెల 17వ తేదీ వరకు ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్సై స్వామినాయుడు అన్నారు. మండలంలోని కోండెవరం శివారు శొంఠవారిపాకలో ఎన్నికలపై గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరిపైనైనా కేసు నమోదయితే జీవితాంతం పోలీసుల ఎదుట హాజరై తహసీల్దారు కోర్టులో తాను తగాదాలకు దిగనని హామీఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో మద్యం, సొమ్ముతో ఓటర్లను అభ్యర్థులు మభ్యపెట్టకుండా ప్రభుత్వం నిఘా పెట్టిందన్నారు. ఈ ఎన్నికల సమయంలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకండా ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు. వివాదాస్పద పోలింగ్ కేంద్రాలపై గట్టి నిఘా కొనసాగుతుందన్నారు.

రంగు మారిన తాగునీరు



కొత్తమూలపేటలో రంగు మారిన తాగునీరు

కొత్తపల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని చెబుతున్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పంచాయతీల్లో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పైపులైన్లు మరమ్మతులతో మండలంలోని కొత్తమూలపేటలో త్రాగునీరు కలుషితమవుతుంది. తాగడానికి ఉపయోగపడడంలేదు. ముఖ్యంగా ప్రధాన పైపులైను డ్రైనేజీల కింద ఉండడం, పలుచోట్ల మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కుళాయిల నుంచి జలగలు, చిన్న చిన్న పురుగులు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం వాడుకోవడానికి కూడా వీలులేని విధంగా ఉన్నాయని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

పిఠాపురం: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు హక్కు లేని వారు ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పిఠాపురం ఆర్ఓ రామసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఫారం-6ను పూర్తి చేసి సంబంధిత తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. హోమ్ ఓటింగ్ సదుపాయం ద్వారా ఓటు వేసే వారు 85 ఏళ్ల నిండినవారు శారీరక అంగవైకల్యం ఉన్న వారు ఈనెల 22వ తేదీ లోపు ఫారం-12డీని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ఆయన కోరారు.



పెద్దాపురంలో ముస్లింలతో ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పిఠాపురంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లింలు
- మసీదులో వంగా గీత ప్రార్థనలు

పిఠాపురం: రంజాన్ పండగను ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పిఠాపురంలో ఉన్న రెండు మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయాన్నే మసీదులకు వెళ్లిన ముస్లింలు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుని కలిసి ప్రార్థనలు నిర్వహించారు. పిఠాపురంలో రంజాన్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ముస్లింలను గుర్తించింది వారికి మేలు చేసింది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రానున్న రోజుల్లో ముస్లింల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, రావుల మాదవరావు, ముమ్మిడి శ్రీనివాసు, బాలిపల్లి రాంబాబు మైనార్టీ నేత మొహిద్దీన్, పలువురు ముస్లిం నేతలు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వంగా గీత తదితరులు

ముస్లింలకు దొరబాబు, రాజప్ప శుభాకాంక్షలు

సామర్లకోట: రంజాన్ వేడుకలను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పవిత్ర మాసం ముగింపు సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్త్రీలు, పురుషులు వేరు వేరుగా ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే రాజప్ప ముఖ్య అతిథులుగా పాల్గొన్ని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల మతగురువు మహ్మద్ ఫేరోజ్ రంజాన్ ప్రాధాన్యాన్ని వివరించారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని పేర్కొన్నారు. ఈ పండగ మానవాళికి హితాన్ని బోధిస్తుందన్నారు. ముస్లింల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చెర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్ని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నాయకులు మహ్మద్ ఇనాముల్లా, ఎండీ హబీబుల్లా, ఎండీ తవ్వాబ్, ఎండీ లాహేర్, సఫీఉల్లా, ఇనాముల్లా, ఎండీ రిజ్వాన్, తహీర్ పాల్గొన్నారు. అదే విధంగా పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రార్థనా మందిరంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ముస్లింల శ్మశాన వాటిక వద్ద పూర్వీకుల కోసం ప్రార్థనలు చేశారు.

పెద్దాపురం: స్థానిక కట్టమూరు పుంతలో ఈద్గా మెట్ట వద్ద రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద మసీదు ఇమాం అబ్దుల్ గఫర్‌ఖాన్ సమాజ్ ఆచరించగా రెండు మసీదులకు చెందిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు ముస్లింకు శుభాకాంక్షలు తెలిపి వేడుకల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో మరింత సంక్షేమం

- ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- ఒకటి, 28 వార్డుల్లో ఎన్నికల ప్రచారం



సామర్లకోటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా ప్రజలకు మరింత మేలు చేస్తారని ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక 28, ఒకటో వార్డులో కౌన్సిలర్లు రెడ్నం సునీత, రెడ్డి లోవ కుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని, గతంలో చంద్రబాబునాయుడు పసుపు, కుంకుమ తప్ప ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఆయనను నమ్మే స్థితిలో ఓటర్లు లేరని దవులూరి అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఈ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓట్లు వేయండని చెప్పే ధైర్యం ఎవరికి ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రతి ఓటరు ఎంపీకి ఒకసారి, ఎమ్మెల్యేకు ఒకసారి ఫ్యాను గుర్తుపై బటన్ నొక్కాలని దొరబాబు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్ పర్సన్ పెదపాటి అమ్మాజీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, వేగి సత్యనారాయణ, కానుబోయిన విజయకృష్ణ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మాదిగల ఆత్మీయ సమేళనం

సామర్లకోట: మాదిగల ఐక్యతను చాటి చెప్పడానికి శుక్రవారం రాత్రి మాదిగల ఆత్మీయ సమేళనం ఏర్పాటు చేసినట్టు మాదిగ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న పూర్ణ కల్యాణ మండపంలో జరిగే సమేళనంలో మాదిగల మద్దతు వైఎస్సార్ సీపీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. పలివెల జనార్దన్, కాళ్ల లక్ష్మీనారాయణ కాతేటి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు: చేబ్రోలులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం విద్యుత్ శాఖ ఈఈ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. వార్షిక మరమ్మతుల పనులు జరుగుతున్నందున ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీని అధికారంలోకి రాకుండా చూడడం, మార్క్సిస్టుల బలాన్ని పార్లమెంటులో పెంచుకోవడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కూటమిని ఓడించడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తక్షణమే పార్టీ యూనిట్లను సమావేశ పరిచి, లక్ష్యాలను గ్రామస్థాయిలో తీసుకెళ్లడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, మోర్త రాజశేఖర్, కెఎస్ శ్రీనివాస్, దువ్వా శేషబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కరప: తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు ఉప్పలంక గ్రామానికి చెందిన బాలిక బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలసి తమ గృహంలో నిద్రించింది. గురువారం ఉదయం తల్లి లేచేసరికి పక్కన కుమార్తె కనిపించలేదు. తల్లిదండ్రులు ఆమె కోసం ఉప్పలంక, పరిసర గ్రామాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లోను ఆరా తీసినా ఆచూకీ కనిపించలేదు. దీంతో గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి



పి.రాయవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత తదితరులు

వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. ఆమె పిఠాపురం మండలం పి.రాయవరంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. ఈ విషయం ఎన్నికల ప్రచారంలో ప్రజల ఆదరణ వల్ల తెలుస్తోందన్నారు. ఓటు వేయడం మీపని అభివృద్ధి చేయడం నాపని అంటు ప్రచారం చేస్తుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోంది. ఎక్కడ చూసినా జనం ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీవైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ మహిళా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరి, మాజీ సర్పంచ్ మాదేపల్లి వెంకటేశ్వరరావు, మహిళా నాయకురాలు మాకినీడి శేషకుమారి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థితోనే అభివృద్ధి సాధ్యం



దోమాడపాకలులో ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్న దవులూరి చంద్రకళ, ఎంపీపీ తదితరులు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి సతీమణి చంద్రకళ
- దోమాడపాకలులో ఎన్నికల ప్రచారం

సామర్లకోట: స్థానికుడైన తన భర్త, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబును ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని దవులూరి చంద్రకళ అన్నారు. గురువారం వేట్లపాలెం నుంచి గోదావరి కాలువ గట్టు మీదుగా ఆరు కిలోమీటర్ల దూరంలోని దోమాడపాకల్లో ఆమె ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, కౌన్సిలర్లు పాలిక కుసుమ, కానేటి రాజేశ్వరి, చిట్టుమాని రాఘవ, పార్టీ నాయకులు గోలి బాబ్జీలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ స్థానికుడైన ఎమ్మెల్యేతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఒక్కసారి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాట వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా సునీల్‌కు ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థిగా దొరబాబుకు ఒక ఓటు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. సీఎం జగన్ పేదల కోసం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఆయనను ఓడించే ధైర్యం లేక మూడు పార్టీలతో పొత్తు పెట్టుకుని చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, వేగుళ్ల బాబ్జీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



సామర్లకోటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: స్థానిక 8వ వార్డు తెలుకుల పుంతకు చెందిన 25 కుటుంబాలు గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. నేతల హరిబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరడానికి వచ్చిన వారికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, యార్లగడ్డ జగదీష్, పాగా సురేష్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఒకటో వార్డులోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో టీడీపీకి చెందిన వార్డు కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 40 మంది దవులూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.



సామర్లకోట రాజీవ్ గృహకల్పలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దొరబాబు

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

సామర్లకోట: మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతాపలదొడ్డిలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి కమిషనర్ జె.రామారావు నివాళులు అర్పించి ఆయన సేవలను వివరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జె.శ్రీనివాసు ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. డిప్యూటీ తహసీల్దార్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో పాల్గొన్నారు. అలాగే స్థానిక ట్రాన్స్‌కో సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈ ఏపీఎల్ఎస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఏఈ రమేష్‌కుమార్ ఇతర సిబ్బంది నివాళులు అర్పించారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించిన తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు

రేపటి నుంచి భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు

ఏలేశ్వరం: 50వ భక్తిజ్ఞానవేదాంత మహాసభలు సిరిపురంలోని చిద్గగనానంద గీతాశ్రమంలో శనివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో వేదాంత మహాసభలు నిర్వహించనున్నారు. ఈ సభలకు పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు హాజరుకానున్నారు. మేడపాడు గీతాశ్రమం పీఠాధిపతి కృష్ణానందాగిరి స్వామి, శంకరానందగిరిస్వామి లక్ష్మీనర్సాపురం ఆశ్రమం నుంచి సూర్యహాసభల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇవ్వనున్నారు. మహాసభల్లో భాగంగా ప్రతిరోజు ప్రణోవపాశన, సూర్యనమస్కారాలు, భజనలు, గీతాపారాయణం, యజ్ఞాలు నిర్వహించనున్నారు.



పుట్టిన వెంటనే చంటి పిల్లలకు వైద్య సేవలు



బాలింతలకు పిల్ల సంరక్షణపై సూచనలు

చంటి పిల్లలా.. కంటికి రెప్పలా..!

- పురిటి నొప్పులే పులకించేలా ప్రభుత్వ వైద్య సేవలు
- మాతాశిశు సంక్షేమానికి ప్రభుత్వ పథకాల అమలు

పిఠాపురం: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది అనడానికి ఈ ఫొటోలే సాక్ష్యం. మాతృత్వం కోసం ప్రతి స్త్రీ పరితపిస్తుంది. ఒక బిడ్డకు జన్మనివ్వాలంటే తల్లి పునర్జన్మ పొందాల్సిందే. సరైన వైద్యం అందక ఎంతో మంది తల్లులు బిడ్డలను కోల్పోయారు. తల్లులు కన్నుమూసిన సందర్భాలు ఉన్నాయి. అయితే అలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం వివిధ పథకాల అమలు చేసింది. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు రక్షణ కల్పించింది. తల్లి బిడ్డల వైద్య సేవలు విస్తృతం చేసింది. గర్భం దాల్చిన నాటి నుంచి పౌష్టికాహారం మందులు అందించడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిచ్చేలా తల్లి బిడ్డా క్షేమంగా ఉండేలా వైద్య సిబ్బంది తీసుకుంటున్న చొరవ సేవలు ఎందరో తల్లి బిడ్డలకు ప్రాణ దానం చేస్తున్నాయి. కటిక పేదవారి నుంచి ధనవంతుల వరకు ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలోనే పురుడు పోసుకునేంతగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి వైద్య సేవలు ఆదరణ పొందాయి. ఇదంతా వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక మార్పులు వల్లే సాధ్యమైంది.



గర్భం దాల్చిన వెంటనే వైద్య పరీక్షలు



మాతా శిశువులను ఇంటికి క్షేమంగా చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్